క్లుప్తంగా

విద్యాలక్ష్మికి పంచామృతాభిషేకాలు



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్ శ్రీ క్షేత్రమ్‌లో కొలువైన అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వరుని దేవాలయంలో విద్యాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, శ్రీనివాస్ రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి స్నపనం, పంచామృతాభిషేకాలు, అర్చనలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష

డెంకాడ: మండలంలోని జొన్నాడ, అక్కివరం గ్రామాల్లో శనివారం జననన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 11 రకాల సేవలను ఉచితంగా అందజేస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

విజయనగరం ఫోర్ట్: కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ అంబళ్ల కొండమ్మ సూచించారు. నగరంలోని మహారాణిపేట బాలికల వసతిగృహంలో విద్యార్థులకు పౌష్టికాహారం, వ్యక్తిగత శుభ్రతపై శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత రాదన్నారు. ప్రతిరోజూ ఆహారంలో ప్రొటీన్లు, విటమిన్లు ఉండేవిధంగా చూసుకోవాలని తెలిపారు. బాలికలు చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి



నిరసన తెలియజేస్తున్న నగర పంచాయతీ కార్మికులు

నెల్లిమర్ల రూరల్: నగర పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికుల దీక్షా శిబిరాన్ని శుక్రవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కిల్లంపల్లి రామారావు, నాయకులు బాబూరావు, దుర్గారావు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి ముఖ్యమంత్రి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్సఅప్పలనరసయ్య

గజపతినగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిగా వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ రైతుల పక్షపాతిగా మారిపోయారని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. ఈ మేరకు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి రైతు వెన్నెముక లాంటి వాడని అటువంటి రైతులు ఏడాదంతా ఎటువంటి ఇబ్బందులు పడకుండా ముందస్తుగానే వారికి కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించేందుకు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులు పడిన కష్టాలను స్వయంగా చూసిన అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆకష్టాలను పూర్తిగా తొలగించేందుకు తాను అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మేలు చేసి చూపించారన్నారు.

మళ్లీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డే

భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆగిపోయిందని పచ్చపత్రికల్లో వెలువడిన వార్తను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తీవ్రంగా ఖండించారు. పచ్చపత్రికలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసి, ఎన్ని పిచ్చిరాతలు రాసినా వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేది వైఎస్ జగన్‌మోహన్ రెడ్డేనని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఘంటాపథంగా చెప్పారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ వేమలిము త్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి. వెంకటరావు, పార్టీ సీనియర్ నేతలు బెల్లాన త్రినాథరావు, మ ండల సురేష్, కడుపుట్ల పైడిపునాయుడు, సోషల్ మీడియా నియోజకవర్గం కన్వీనర్ పాటిపిరెడ్డి నారాయణ మూర్తి, కె.రామునాయుడు, నాయుడు, పి.ప్రకాష్ పాల్గొన్నారు.

సమస్యలను తెలుసుకుంటూ..

పరిష్కారం చూపుతూ...

- 4వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం
- ప్రజలతో మమేకమైన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



4వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీస్తూ.. వెనువెంటనే వాటికి పరిష్కారం చూపుతూ ముందుకు సాగారు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి. నగరంలోని 4వ డివిజన్ పరిధి బాబామెట్ట పరిసర ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లిన ఆయన.. ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అలాగే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మారోజు శ్రీను, గాదం మురళి మీడియాతో మాట్లాడుతూ.. సంపూర్ణ అభివృద్ధే లక్ష్యంగా స్థానిక శాసనసభ్యుడు కోలగట్ల వీరభద్రస్వామి పనిచేస్తున్నారని తెలిపారు. డివిజన్ పరిధిలో రూ.5 కోట్ల వ్యయంతో వివిధ పనులు చేపట్టామన్నారు. గత ప్రభుత్వాలతో పోల్చుకుంటే ఈ నాలుగేళ్లలో నగర వ్యాప్తంగా కోలగట్ల మార్కు అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వి.విజయలక్ష్మి, సహాయ కమిషనర్ ప్రసాదరావు, పలు విభాగాల సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



23వ డివిజన్‌లో పాల్గొన్న డిప్యూటి మేయర్లు

90 శాతం సమస్యలు పరిష్కారం..

స్థానికంగా గుర్తించిన వాటితో పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను 90 శాతం వరకు పరిష్కరించామని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తిచేసి సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. నగరంలోని 23వ డివిజన్ పరిధి చిన్నవీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మరో డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్‌తో కలిసి ఆమె.. గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వినిపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, డివిజన్‌లో చిన్నపాటి సమస్యలను గుర్తించామని, వాటిని వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు, పలు విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక యాజమాన్య పద్ధతులు పాటించాలి

- జిల్లా పశు సంవర్థక శాఖ జె.డి విశ్వేశ్వరరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా పశు సంవర్థక శాఖ జె.డి విశ్వేశ్వరరావు

విజయనగరం ఫోర్ట్: సాంకేతిక యాజమాన్య పద్ధతులు పాటిస్తూ గొర్రెలు, మేకలను పెంచడం వల్ల అధిక మాంసం ఉత్పత్తవుతుందని జిల్లా పశుసంవర్థక శాఖ జె.డి డాక్టర్ ఎ. విశ్వేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక పశు సంవర్థకశాఖ కార్యాలయంలో నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ఆర్థిక సహకారంతో జిల్లాలో గల గొర్రెల పెంపకందారులకు లాభసాటి సన్నజీవుల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొర్రెలు, మేకల పెంపకంలో మెలకువలు పాటించాలని సూచించారు. సకాలంలో గొర్రెలు, మేకలకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో డీడీ వైవీ రమణ, డీసీసీబీ ఏజీఎం వాసు, గొర్రెల పెంపకం దారుల సహకార సంఘ అధ్యక్షుడు మన్యాల కృష్ణ, వేణుమాధవ్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల రూరల్: నగర పంచాయతీ పరిధిలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ల పోస్టులకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ బాలాజీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణ పరిధిలోని 8 వార్డు సచివాలయాల పరిధిలో మొత్తం 126 వార్డు వలంటీర్లకు గాను ప్రస్తుతం 116 మంది సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు ఖాళీగా ఉన్న పది వలంటీర్ల పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. జరజాపుపేట, మొయిద జంక్షన్, అగురువీధి, ఇందిరాకాలనీ, గాంధీనగర్ కాలనీ ప్రాంతాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నెల 22 నుంచి 26 దరఖాస్తులు స్వీకరిస్తామని.. 27,28 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన వారికి ఆగస్టు ఒకటో తేదీన నియామక పత్రాలు అందజేస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

నెలిమర్ల రూరల్: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటం చేస్తోందని ఆ శాఖ కేంద్ర కమిటీ సభ్యురాలు పావని, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్వాతంత్య్రం వచ్చిన తర్వాత విద్యార్థుల హక్కుల కోసం పోరాటం చేసేది ఎస్ఎఫ్ఐ మాత్రమేనని చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు రవికుమార్, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఈ నెలాఖరులోగా పనులు పూర్తి

- మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు



సచివాలయ సిబ్బందికి సూచనలు అందిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి వి. శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులతో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై దృష్టి సారించాలన్నారు. సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సచివాలయ, వెల్‌నెస్, ఆర్‌బీకే భవనాలు నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని తెలిపారు. అలాగే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లోనూ పక్కాగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గిరిబాల, ఈఓపీఆర్‌డీ హెచ్. భానోజీ రావు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతా తెరుచుకోవాలి

విజయనగరం పూల్‌బాగ్: జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎమ్ఎమ్ఎస్)కి ఎంపికై న విద్యార్థుల మెరిట్ కార్డులు జిల్లా విద్యాశాఖాధికారి వారి కార్యాలయంలో ఉన్నట్లు డీఈఓ బి. లింగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో స్కాలర్‌షిప్ పోర్టల్ ఓపెన్ చేయబడుతుందన్నారు. వారి నియమాల ప్రకారం ఎంపికైన ప్రతి విద్యార్థి వెంటనే ఏదైనా జాతీయ బ్యాంక్‌లో విద్యార్థి పేరున సేవింగ్స్ అకౌంట్ తీసుకుని తండ్రి లేదా తల్లిని జాయింట్ చేసుకోవాలన్నారు. విద్యార్థి ఆధార్ నంబర్‌ను మాత్రమే అకౌంట్‌కు జత చేయాలన్నారు. విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ మెరిట్‌కార్డులో ఉన్న విధంగానే ఆధార్‌కార్డులోనే బ్యాంక్ పాస్‌బుక్‌లో ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు.

రసాయన ఎరువులతో ఆరోగ్యానికి ముప్పు

నెల్లిమర్ల రూరల్: రసాయన ఎరువుల వినియోగంతో ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని చీపురుపల్లి సబ్ డివిజన్ ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఒమ్మి గ్రామంలో కషాయాల తయారీపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గాయిత్రి, రామలక్ష్మి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకపఠనంపై ఆసక్తి పెంపొందించేందుకు కృషి



పుస్తకాలు అందుకుంటున్న జిల్లా గ్రంథాయ సేవా సంఘ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: నేటి యువత, విద్యార్థులపై సెల్‌ఫోన్ల ప్రభావం అధికంగా ఉన్న నేపథ్యంలో పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంచేందుకు కృషి చేస్తున్నామని జిల్లా గ్రంథాలయ సేవా సంఘ ప్రతినిధులు తెలిపారు. నగరంలోని కొత్తపేటకు చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి గూడూరు రాజేశ్వరరావు గ్రంథాలయానికి పలు పుస్తకాలు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, పుస్తకాల సేకరణ నిరంతరం చేపడతామన్నారు. ఇళ్లల్లో వృథాగా ఉన్న పుస్తకాలను దాతల నుంచి సేకరించి అవసరమైన వారికి అందజేస్తున్నామని తెలిపారు. పుస్తకాలు అందజేయాలనుకునే వారు 98493 77577, 95050 90207 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపకుడు అబ్దుల్ రవూఫ్, జి.వాసంతి, తదితరులు పాల్గొన్నారు.

ధ్యానం, యోగాతో ఏకాగ్రత

చీపురుపల్లి: నిరంతరం ధ్యానం, యోగా చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుందని, తద్వారా లక్ష్యాలను సాధించవచ్చని శ్రీ చైతన్య యోగా కేంద్రం వ్యవస్థాపకురాలు గవిడి సుజాత అన్నారు. పట్టణంలోని జి.వి.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆర్మీ కొలువల కోసం సిద్ధమవుతున్న యువతకు పట్టణానికి చెందిన ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా, ధ్యానంపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఆర్ఏల రిలే నిరాహార దీక్షలు

విజయనగరం రూరల్: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్ఏ) చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం కూడా కొనసాగాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షకు హాజరైన సీఐటీయూ నగర కార్యదర్శి బి.రమణ మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల 7,8 తేదీల్లో కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న వీఆర్ఏల జిల్లాస్థాయి దీక్షలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.గురుమూర్తి, అంబేడ్కర్ దళిత సంఘ జిల్లా నాయకులు సోము మురళి, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

విజయనగరం పూల్‌బాగ్: జీఓ నంబర్లు 117, 84, 85 రద్దు చేయాలని కోరుతూ ఈనెల 23న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ విజయనగరం, పార్వతీపురం – మన్యం జిల్లాల అధ్యక్షులు డి. ఈశ్వరరావు, సీహెచ్ వెంకటరమణ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక లక్కపందిరివారి వీధిలో గల సంఘ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వి. శివున్నాయుడు, వి. ధనుంజయనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు గ్రీవెన్స్ సెల్

విజయనగరం టౌన్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్‌లో గల ఈడీ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ మాట్లాడుతూ.. విశాఖ నుంచి నలుగురు, విజయనగరం నుంచి ఒకరు , పార్వతీపురం నుంచి 8 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఒకరు, శ్రీకాకుళం నుంచి 13 మంది.. జోన్ పరిధిలో ముగ్గురు తమ సమస్యలను విన్నవించుకున్నారన్నారు. ప్రతి నెలా మూడో శుక్రవారం గ్రీవెన్స్ సెల్ ఉంటుందని, ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిర్లక్ష్యం వల్లే మణిపూర్‌లో అల్లర్లు

విజయనగరం పూల్‌బాగ్: మణిపూర్‌లో 80 రోజులుగా జరుగుతున్న ఘర్షణలకు కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమని ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా 29వ డివిజన్ రామకృష్ణానగర్ నుంచి రాజీవ్‌నగర్ కాలనీ వరకు, గాజులరేగలోను శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. దేశ ప్రజలంతా మహిళలకు అండగా ఉండి, మహిళల రక్షణ కోసం చేపడుతున్న పోరాటానికి మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు జగదాంబ, బుజ్జమ్మ, కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ టవర్ల ఏర్పాటుకు స్థల సేకరణ



తిప్పలవలసలో సెల్ టవర్ ఏర్పాటుకు స్థల సేకరణ చేస్తున్న బీఎస్ఎన్ఎల్, రెవెన్యూ అధికారులు

పూసపాటిరేగ: మండలంలోని తిప్పలవలస, ఎరుకొండ గ్రామాతలో మాఎస్ఎన్ఎల్ టవర్ల ఏర్పాటుకు బీఎస్ఎన్ఎల్, రెవెన్యూ అధికారులు శుక్రవారం స్థల సేకరణ చేశారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు కృషితో తీరప్రాంతంలో బీఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఎంతో కాలంగా తీరప్రాంతంలో సెల్ సిగ్నల్స్ లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు చాలా ఇబ్బంది పడ్డారు. ఎట్టకేలకు సెల్‌టవర్లు మంజూరుకావడంతో ఎరుకొండ, తిప్పలవలస గ్రామాలలో స్థల సేకరణ చేశారు. పరిశీలనలో బీఎస్ఎన్ఎల్ ఇంజినీర్ ఆర్. సురేష్, టెక్నీషియన్ పి. రమణారావు, తహసీల్దార్ ఇ. భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, తిప్పలవలస మాజీ సర్పంచ్ వాసుపల్లి అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్‌కు పరామర్శ



మజ్జి నర్సింగరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్



మజ్జి శ్రీనివాసరావును పరామర్శిస్తున్న శ్రీకాకుళం జెడ్పీ చైర్మన్ విజయ

విజయనగరం: విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును శ్రీకాకుళం జిల్లా నేతలు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల మజ్జి శ్రీనివాసరావు తండ్రి మజ్జి నర్సింగరావు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. శ్రీకాకుళం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ జెడ్పీ చైర్మన్ స్వగృహానికి చేరుకుని నరసింగరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సన్మానం



విశ్రాంత ఉపాధ్యాయుడు సుదర్శనరావును సన్మానిస్తున్న సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పూతికపేట ప్రాథమిక పాఠశాలలో విశ్రాంత ఎంటీఎస్ ఉపాధ్యాయుడు సురాకాసి సుదర్శనరావును సహచర ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. మొయిద స్కూల్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్ మహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ, సుదర్శనరావు సేవలను కొనియాడారు. అలాగే పూతికపేట పాఠశాలలో (2022-23) డిప్యుటేషన్ పద్ధతిలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఎల్లంనాయుడు మాస్టారును కూడా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం గణేష్, సిబ్బంది ఎన్‌వీ రమణ, శ్రీనివాసరావు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజా సంక్షేమం



కొప్పెర్లలో పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ రామారావు, పతివాడ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీడీఓ జి.రామారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొప్పెర్ల గ్రామ సచివాలయం పరిధిలో గల పాత కొప్పెర్ల, ఎరుకొండ, కొత్త కొప్పెర్ల గ్రామాలకు సంబంధించి శుక్రవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయ పరిధిలో 830 మందికి వివిధ రకాలు ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రజా సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కరించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 11 రకాలు ధ్రువపత్రాలు ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ఏపీఓ రత్నమాల, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, పీఆర్ డీఈ శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు పుప్పాల లక్ష్మీనారాయణ, లంకలపల్లి రాజారావు, రామసుందరి, బొల్లు రమేష్, పైడి రవి, తదితరులు పాల్గొన్నారు.

బీజామృతంతో విత్తనశుద్ధి



విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సీఏ గురుమూర్తి

డెంకాడ: మండలంలోని నాతవలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయం సీఏ గురుమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం విత్తనశుద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ, బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం వల్ల పైరులో చీడపీడలను నివారించవచ్చన్నారు. పొడ, అగ్గి తెగులు, కాండం తొలిచే పురుగులు ఆశించవచ్చని చెప్పారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

విజయనగరం పూల్‌బాగ్:

పీఎం యశస్వి ఉపకార వేతనాలకు (2022–23 సంవత్సరానికి) అర్హత గల బీసీ , ఈబీసీ, సంచారజాతుల కులాల చెందిన విద్యార్థులు ఆగష్టు 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి ఎం. యశోధనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ ఏడాది సెప్టెంబర్ 29న నిర్వహించనున్న పరీక్షలో ప్రతిభ కనబరిచిన 9,10వ తరగతి విద్యార్థులకు సంవత్సరానికి రూ.75 వేలు, 11, 12వ తరగతి విద్యార్థులకు సంవత్సరానికి రూ.1.25 లక్షలు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయ పనిదినాల్లో సంప్రదించాలని సూచించారు.